క్లుప్తంగా

రక్తదాన శిబిరం ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో విశ్వబంధు దినోత్సవం, ఆ సంస్థ వ్యవస్థాపకురాలు ప్రకాష్‌మణి దాది వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 40 మంది రక్తదానం చేసినట్లు ఆ శాఖ నిర్వాహకురాలు బీకే ప్రసన్న తెలిపారు.

మోసం చేశారు.. న్యాయం చేయండి



మాట్లాడుతున్న బాధితులు

నెల్లూరురూరల్: హైదరాబాద్‌కు చెందిన వివిడ్ లెర్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు లాభాలు వస్తాయని మాతో డబ్బులు కట్టించుకుని మోసం చేశారని, తమకు న్యాయం చేయాలని నెల్లూరుకు చెందిన సుబ్బరాయుడు, హసీన, మాల్యాద్రి, సునీల్‌కుమార్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కంపెనీ సీఈఓ రాజశేఖర్‌రెడ్డి, ఎండీ సౌందర్య భార్గవి, డైరెక్టర్లు కలిసి మీకు లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పి అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. పదిమంది దాదాపు 1.50 కోట్లు పెట్టుబడిగా పెట్టామని తెలిపారు. అయితే లాభాలకు సంబంధించిన లెక్కలు చెప్పకపోవడంతో ఆ కంపెనీ వద్దకు వెళ్లి విచారించగా మూసేశారన్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం లేదన్నారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

ఇబ్బందుల్లేకుండా నిమజ్జన ఏర్పాట్లు



నిమజ్జన ఏర్పాట్ల పనులను పర్యవేక్షిస్తున్న ఎంహెచ్‌ఓ కనకాద్రి

నెల్లూరు(బారకాసు): నగరంలోని గణేష్ ఘాట్ల వద్ద ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి తెలిపారు. నగర పరిధిలోని పలు గణేష్ ఘాట్ల వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎంహెచ్‌ఓ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న వినాయక చవితి నిమజ్జన ఏర్పాట్లలో ఎలాంటి అవాంతరాలు లేకుండా, కమిటీ నిర్వాహకులకు ఇబ్బంది లేకుండా సమన్వయంతో పనిచేయాలని, గతం కంటే పారిశుధ్యాన్ని పూర్తిస్థాయిలో మెరుగ్గా ఉండేటట్లు పని చేయాలని సిబ్బందికి సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు ముగిసేంత వరకు ప్రతిఒక్కరూ నగరపాలక సిబ్బందికి సహకరించాలని తెలియజేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



నెల్లూరు(బారకాసు): నగరంలోని ఆచారివీధిలో ఉన్న న్యూ ఆంధ్రా జ్యూవెలరీ వద్ద సోమవారం మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు. నెల్లూరు రౌండ్ టేబుల్–259 ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ గాదంశెట్టి హేమంత్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తమ సభ్యులందరూ కలిసి 259 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశామన్నారు. సభ్యులు నిఖిల్‌జైన్, మునగా చైతన్య, జెనిత్ రెడ్డి, భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు కృషి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో క్షయవ్యాధి నివారణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. నగరంలోని డేమియన్ ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో రోగుల వద్దకు వెళ్లి మందులు మింగించాలని కోరారు. అనంతరం టీబీ పరీక్షలు, వారికి అందించే మందులు, ప్రభుత్వ సాయం తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో భవ్య సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి సారూ..

కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. మండల కేంద్రాల్లో పరిష్కారం కాని సమస్యలపై ప్రజలు అధికారులకు వినతులు అందజేసి న్యాయం చేయాలని కోరారు. అలాగే వివిధ సంఘాల నేతలు వారి హక్కుల సాధన కోసం కలెక్టరేట్ ఆవరణలో ధర్నాలు చేశారు.
– నెల్లూరు(అర్బన్)

పెండింగ్ పరిహారం ఇప్పించాలి



మాట్లాడుతున్న నజీర్‌బాషా

2017లో ప్రభుత్వం ఎంఎస్ఎం పార్కు కోసమంటూ తన పొలాన్ని సేకరించి కొంత పరిహారం ఇచ్చారని, మిగతా పరిహారాన్ని కూడా ఇప్పించాలని ఆమంచర్లకు చెందిన నజీర్‌బాషా కోరారు. కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతి పత్రం అందజేసి మాట్లాడారు. తనకు ఆమంచర్లలో సర్వే నంబర్ 556–1లో 1.63 ఎకరాలు, 550–1లో 0.3 సెంట్ల భూమి ఉందన్నారు. దీనిని ప్రభుత్వ అవసరాలకు సేకరించారన్నారు. ఎకరాకు రూ.10 లక్షల చొప్పున రూ.16.60 లక్షల పరిహారం రావాల్సి ఉండగా రూ.14.50 లక్షలు ఇచ్చారన్నారు. మిగతా పరిహారం ఇప్పించాలని కోరారు.

‘నాకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేశారు’

- కోవూరు సబ్ రిజిస్ట్రార్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మహిళ

నేను అద్దెకు ఇచ్చిన ఇంటిని నాకు తెలియకుండా ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా వేరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన కోవూరు సబ్ రిజిస్ట్రార్‌తో పాటు అందుకు సహకరించిన పంచాయతీ కార్యదర్శి బ్రహ్మరెడ్డిపై కఠినమైన చర్యలు చేపట్టాలని బాబావలీ అనే మహిళ కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె నెల్లూరు నగరంలో కలెక్టర్ ఆనంద్‌కు అర్జీ ఇచ్చి, మాట్లాడారు. తాను గండవరం పంచాయతీలో 2015లో మోహనమ్మ అనే మహిళ నుంచి ఇంటిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. తన భర్త ఉద్యోగ నిమిత్తం పొదలకూరులో కాపురం ఉంటున్నామన్నారు. తనకు ఇంటిని విక్రయించిన ఆమె అద్దెకు ఉంటామని కోరితే ఇచ్చామన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇంటి పన్ను చెల్లిస్తున్నామన్నారు. అయితే ఈ సంవత్సరం ఇంటి పన్ను చెల్లించేదానికి వెళ్తే ఆ ఇల్లు తన పేరు మీద లేదని, గతంలో తనకు ఇల్లు అమ్మిన మోహనమ్మ అనే మహిళ ఆమె కూతురు వరలక్ష్మి పేరుతో రిజిస్ట్రేషన్ చేసిందన్నారు. 2024 వరకు ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్ ఈసీ నకలు తమ పేరుమీద ఉన్నాయన్నారు. ఇంటి పన్ను వేసే పంచాయతీ సెక్రటరీ బ్రహ్మరెడ్డి కూడా తనకు తెలియకుండానే మోహనమ్మ పేరుతో ఇప్పుడు కొత్తగా పన్ను వేయడం అన్యాయమని తెలిపారు. అందువల్ల దొంగ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన పంచాయతీ కార్యదర్శి, సబ్‌రిజిస్ట్రార్‌పై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ విచారణ జరిపిస్తామన్నారు.

రజకులకు సామాజిక రక్షణ అవసరం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రజక సంఘం నాయకులు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రజకులకు సామాజిక రక్షణ చట్టం చేసి అమలు చేయాలని, ఆదరణ–3 పథకం ద్వారా ఆధునిక వృత్తి పరికరాలు సరఫరా చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రేకులగుంట అంకయ్య కోరారు. ఈ మేరకు సోమవారం పలువురు రజకులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు పలుచోట్ల దాడులకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రజకులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, దోబీఘాట్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటకృష్ణయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, పద్మమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని ఉప్పుటూరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో బెల్లంకొండ వినయ్, చించుకృష్ణయ్య, హరిబాబు వారి మిత్ర బృందం ఉంది. కార్యక్రమంలో దయాకర్, మధు, వినయ్, వినోద్, రఘురామ్‌రెడ్డి, రవీంద్ర, వాసు, నీలయ్య, చంచయ్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఆనం విజయకుమార్‌రెడ్డి

మట్టి గణపతి ప్రతిమలను పూజించండి

నెల్లూరురూరల్: సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. సాంప్రదాయ ప్రకృతిపూజ నిజమైన గణపతి పూజ అని తెలిపారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఫత్తేఖాన్‌పేటలోని రైతు బజార్‌లో మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను మంగళవారం దాదాపు 2 వేల మందికి ఉచితంగా పంపిణీ చేస్తారని వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, అధికారులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ఉపాధి పనులకు నిధులు పెంచాలి

నెల్లూరు సిటీ: ఉపాధి హామీ పనులకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.వెంకమరాజు, మంగళ పుల్లయ్య అన్నారు. రూరల్ మండలంలోని పొట్టేపాళెంలో వ్యవసాయ కార్మిక సంఘం నాలుగో మహాసభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్ల నిధులను కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.83 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది తగదన్నారు. వెంటనే ఉపాధి హామీ పనులకు నిధులను పెంచి వ్యవసాయ కార్మికులకు 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం 11 మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీపతి వెంకయ్య, పాదర్తి మస్తానయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు మాదాల వెంకటేశ్వర్లు, ఆలూరి తిరుపాలు, అల్లాడి గోపాల్, పూడిపర్తి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో నెల్లూరీయుల ప్రతిభ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో నెల్లూరు జిల్లాకు చెందిన వారు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా పత్తిపాడులో జరిగిన యోగాసనాల పోటీల్లో సీనియర్ కేటగిరీ–సీలో కావ్యశ్రీ రెండు బంగారు పతకాలను, ప్రసన్న బ్రాంజ్ మెడల్‌ను, పద్మావతి రెండు గోల్ మెడల్స్‌ను, సీనియర్ కేటగిరీ–బీలో దేవతా సుప్రియ గోల్డ్ మెడల్, రేవతి బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. వీరిని నగరంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న ప్రశాంతి క్షేత్రంలో సోమవారం సన్మానించారు. స్టేట్ జాయింట్ సెక్రటరీ అనిల్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, వైస్ ప్రెసిడెంట్ రవీంద్ర, సెక్రటరీ విజయ్‌కుమార్, రమణయ్య, సభ్యులు పాల్గొన్నారు.



పతకాలను సాధించిన వారితో అసోసియేషన్ నాయకులు

నేటి నుంచి సిద్ధి విఘ్నేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పప్పులవీధిలోని సిద్ధి విఘ్నేశ్వరాలయంలో మంగళవారం నుంచి గణనాథుని వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయని ఆలయ పాలకమండలి చైర్మన్ బయ్యా ప్రసాద్ తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్వామివారి సన్నిధిలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం 6 గంటలకు పవిత్ర పినాకిని నది తీర్థ గ్రహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వినాయక చవితి పండగ సందర్భంగా బుధవారం ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణ జరుగనుందన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. సమావేశంలో ఆలయ ప్రధానార్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ, పాండురంగ అన్నదాన సమాజం కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పాదర్తి బాలాజీ, శేగు శేఖర్‌బాబు, ఆలయ సభ్యుడు పచ్చిపాల లీలామోహన్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ఇంటి తాళాలు పగులగొట్టి ఆభరణాలు చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించుకుని వెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్జీఓ కాలనీలో రాజేశ్వరి కుటుంబం నివాసం ఉంటోంది. ఈనెల 23న ఆమె తన కుటుంబంతో కలిసి సైదాపురం మండలం చికవోలు గ్రామంలో దేవుని కల్యాణానికి వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 72 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇంట్లో ఉన్న సుమారు 500 గ్రాముల వెండి వస్తువులను అపహరించుకుని వెళ్లారు. రాజేశ్వరి కుటుంబం 24వ తేదీ రాత్రి ఇంటికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించి సోమవారం వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబర్‌లో పోషకాహార మాసోత్సవాలు

నెల్లూరు(పొగతోట): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వచ్చే నెల 1 నుంచి 30వ తేదీ వరకు పోషకాహార మాసోత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారంపై తల్లులకు అవగాహన కల్పిస్తామన్నారు.

మత్స్య రైతులకు శిక్షణ

నెల్లూరు(పొగతోట) : నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మెరుగైన యాజమాన్య పద్ధతులపై మత్స్య రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వీఎస్‌యూ విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ నరసింహారెడ్డి ‘స్ట్రెస్ మేనేజ్‌మెంట్’ అనే అంశంపై పలు సూచనలు చేశారు. కృషి విజ్ఞాన కేంద్ర మత్స్య విభాగం శాస్త్రవేత్త శ్రీహరి సాదు ‘నీటి యాజమాన్య పద్ధతులు’ అనే అంశంపై వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆశాఖ టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీలగిరి సంఘం, బట్వాడిపాళెం, నూతన ఎస్పీ కార్యాలయం, కేవీఆర్ పెట్రోల్ బంక్, పాత ఎస్పీ కార్యాలయం, కస్తూర్బా కళాక్షేత్రం, పోలీస్ పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

చంపుతానని బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిని చంపుతానని బెదిరించి నగదు దోచేసిన ఘటన సోమవారం రాత్రి పెద్దబజారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూరుకు చెందిన సనోజ్‌కుమార్ ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల కిందట నెల్లూరుకు వచ్చారు. మూలాపేట కొండదిబ్బలో నివాసం ఉంటూ పెద్దబజారులో పానీపూరి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి ఆయన పానీపూరి విక్రయిస్తుండగా షాహుల్ అనే వ్యక్తి వచ్చారు. నెలకు రూ.2 వేలు చొప్పున అందరూ ఇస్తున్నారని, నీవు ఎందుకు ఇవ్వడం లేదు..? నగదు ఇవ్వకపోతే చంపుతామని సనోజ్‌కుమార్‌ను కత్తితో బెదిరించాడు. దీంతో బెదిరిపోయిన అతను రూ.2 వేలు ఇవ్వడంతో షాహుల్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి చేసిన వారిపై చర్యలేవీ?



మాట్లాడుతున్న నర్సింగ్ అసోసియేషన్ నేతలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మేల్ నర్సు వెంకటప్పయ్యపై పీజీ, జూనియర్ డాక్టర్లు దాడి చేసి ఆరు రోజులు గుడుస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఏపీ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాధమ్మ, కోటమ్మ ప్రశ్నించారు. దాడికి గురైన వెంకటప్పయ్యను రాష్ట్ర కాంట్రాక్టు నర్సింగ్ అసోసియేషన్, స్ట్రగుల్ కమిటీ, రెగ్యులర్ నర్సింగ్ అసోసియేషన్‌కు చెందిన పలువురు నాయకులు వివిధ జిల్లాల నుంచి వచ్చి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్ బాషా, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో డాక్టర్ మాధవి మాట్లాడుతూ విచారణ జరుగుతోందని, నివేదిక ఆధారంగా దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు స్పందించిన నర్సింగ్ నాయకులు న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి పిలుపునిస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వరలక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యవతి, వసుంధర, నర్సింగ్ సూపరింటెండెంట్ సువార్తమ్మ పాల్గొన్నారు.

అంతా గందరగోళమే

- తక్కువ సమయంలోనే డీఎస్సీ పరీక్షల నిర్వహణ
- ఒక పోస్టుకు ఒక అభ్యర్థే అంటూ మెలిక
- సర్టిఫికెట్ల పరిశీలనపై ప్రకటన, వెనువెంటనే వాయిదా

నెల్లూరు(టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా డీఎస్సీలో గందరగోళం నెలకొంది. డీఎస్సీ ప్రకటన తరువాత అభ్యర్థులకు ఎక్కువ సమయం ఇవ్వకుండానే పరీక్షల తేదీని ప్రకటించింది. ఫలితాల విడుదల కూడా అంతే గందరగోళ నిర్ణయాలు తీసుకుంటుంది. తొలుత ఈ నెల 22న ఫలితాలను ప్రకటిస్తామని చెప్పినా.. 3 రోజుల తర్వాత ఫలితాలను విడుదల చేశారు. మెరిట్ జాబితా ప్రకారం అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపించకుండానే సోమవారం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుందని ప్రకటించారు. అయితే పొద్దుపోయిన తర్వాత వెరిఫికేషన్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. తాజాగా మళ్లీ 28న ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఆ రోజైనా జరుగుతుందా అనే సందేహం అభ్యర్థుల్లో ఉంది.

మెలికలపై మెలికలు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక అభ్యర్థికి ఒక పోస్టు మాత్రమే అని ప్రకటించారు. అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపకుండానే సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుందని హడావుడిగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. జిల్లాలో 673 పోస్టులకు 31 వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నాన్ లోకల్ అభ్యర్థులు కూడా ఉన్నారు. ఆయా సబ్జెక్ట్‌లో నాన్ లోకల్ అభ్యర్థులు అత్యధిక మార్కులు సాధించారు. అయితే ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి నాన్ లోకల్ అభ్యర్థులు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఏఏ సబ్జెక్ట్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖ వద్ద వివరాలు లేవు.

టీడీపీ అధ్యక్ష రేసు.. నేతల సిఫార్సు

- జిల్లా అధ్యక్ష ఎన్నికపై ప్రత్యేక కమిటీ నేడు జిల్లాకు రాక
- తమ వారిని అధ్యక్షుడిగా నియమించుకునేందుకు ముఖ్య నేతల ప్రయత్నాలు

నెల్లూరు సిటీ: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం ముఖ్య నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తమ వాడికే అవకాశం ఇవ్వాలని ఒక వర్గం.. పార్టీ కోసం సంవత్సరాల తరబడి పని చేస్తున్న తమ వాడికే పదవి ఇచ్చి తీరాలని అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. నెల్లూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్ష ఎన్నికపై ప్రత్యేక కమిటీ సభ్యులుగా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ మంగళవారం జిల్లాకు రానున్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో సమావేశం కానున్నారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, 17 అనుబంధ సంఘాల సభ్యుల నియామకాలపై చర్చించనున్నారు. ఆ నివేదికను కమిటీ అధిష్టానానికి ఇవ్వనుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే సంస్థాగత ఎన్నికలు ఈ దఫా ఐదేళ్ల తరువాత జరగడం గమనార్హం.

పాత నేతలకా.. వలస వాదులకా..

జిల్లా అధ్యక్ష పదవి కోసం పార్టీలోని ముఖ్య నేతలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తమ వారికి పదవి దక్కించుకునేందుకు అధిష్టానంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అధ్యక్ష పదవి కోసం ఆశావహుల్లో ప్రస్తుతం కొనసాగుతున్న అజీజ్ తనకు పదవికి కొనసాగించాలని కోరుతున్నారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనూరాధ, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ ఆశావహుల జాబితాలో ఉన్నారు.

ఆక్రమణలు తొలగించండి

నెల్లూరు(బారకాసు): రహదారుల వెంబడి ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ వ్యాపారాలు చేస్తే సహించేది లేదని, తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగరంలోని రంగనాయకులపేట, పినాకిని పార్కు, జాఫర్‌సాహెబ్ కెనాల్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న స్మార్ట్‌స్ట్రీట్ బజార్ ప్రాజెక్టు పనులను అధికారులతో కలిసి కమిషనర్ సోమవారం పర్యవేక్షించారు. అలాగే మినీబైపాస్‌రోడ్డును ఆక్రమించి నర్సరీ నిర్వహిస్తున్న వారితో, అలాగే వినాయక విగ్రహాలు తయారు చేసే నిర్వాహకులతో కమిషనర్ మాట్లాడి రోడ్డు ఆక్రమిస్తూ వ్యాపారాలు చేసుకోవడం సరికాదని, తక్షణమే తొలగించాలని సూచించారు. స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పినాకిని పార్కులో అవసరమైన వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, సిటీ ప్లానర్ హిమబిందు, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మినీబైపాస్ రోడ్డులో ఆక్రమణదారులతో మాట్లాడుతున్న కమిషనర్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఎక్కడా పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ నందన్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. వినాయక విగ్రహాల ఏర్పాటుతో పలు వీధుల్లోకి చెత్త తరలింపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున పక్కా ప్రణాళికలు రూపొందించుకుని ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

53 వినతులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 53 అర్జీలను స్వీకరించామని కమిషనర్ వెల్లడించారు. విభాగాల వారీగా ఇంజినీరింగ్– 6, హౌసింగ్– 25, టౌన్ ప్లానింగ్– 11, రెవెన్యూ– 1, పబ్లిక్ హెల్త్– 1, ఆప్కాస్– 2, పెన్షన్– 7 చొప్పున ఫిర్యాదులను అందుకున్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

ఘనంగా విజయకుమార్‌రెడ్డి జన్మదినం

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విజయకుమార్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి అరుణమ్మ, కుమారుడు కార్తికేయరెడ్డిలను పార్టీ నేతలు సత్కరించారు.

➡ రూరల్ పరిధిలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో ఆనం విజయకుమార్‌రెడ్డి తన జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థులతో కలిసి కేక్ కటింగ్ చేశారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ కె.శ్యామ్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అల్పాహారం అందజేశారు.

➡ నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసానికి సోమవారం వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు.



ఆనం విజయకుమార్‌రెడ్డి, అరుణమ్మ, కార్తికేయరెడ్డిలను సత్కరిస్తున్న పార్టీ నేతలు



అంధ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న విజయకుమార్‌రెడ్డి



విజయకుమార్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పర్వతరెడ్డి